ప్రజాశక్తి

గురువారం 7 డిసెంబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

తుపాను బీభత్సం

◆ 32 వేల ఎకరాల్లో వరి నీటమునక ◆ 420 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం ◆ ఆందోళనలో రైతులు
◆ పలుచోట్ల దెబ్బతిన్న ఇళ్లు ◆ నాలుగు జెర్సీ ఆవులు మృతి ◆ ఎపిఇపిడిసిఎల్‌కు రూ.21 లక్షలు నష్టం
◆ నక్కపల్లి వీవర్స్ కాలనీలోకి చేరిన వరదనీరు ◆ పాడైన మగ్గాలు, చీరలు



మునగపాకలో నీట మునిగిన వరిపంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



నర్సీపట్నం, గొలుగొండ రహదారి మధ్య కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో తుపాను బీభత్సం సృష్టించింది. మూడు రోజులుగా గాలులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో అనకాపల్లి జిల్లాలో అత్యధిక భాగం వరి పంట నీటమునిగింది. సోమవారం నుంచి బుధవారం వరకు ఆ జిల్లాలో 205 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పండిన వరిచేను గాలులకు నేల కొరిగింది. కిందపడ్డ వరి పంటపై నీరు పారడంతో చేనుపై మట్టి చేరింది. కొన్ని ప్రాంతాల్లో కోయడానికి వీల్లేని విధంగా చేనుకు మట్టి అంటుకుంది. వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లా వ్యాపితంగా 32 వేల ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. ఉద్యానశాఖ అంచనా ప్రకారం 96.80 ఎకరాల్లో కూరగాయలు, 70.80 ఎకరాల్లో తమలపాకులు సహా ఇతర పంటలు కలిపి 420 ఎకరాల పంట నీటమునిగింది. జిల్లాలో కూరగాయలు, బొప్పాయి, అరటి పంట దాదాపు వెయ్యి ఎకరాల్లో దెబ్బతింది. భారీ వర్షాలకు వరి, ఉద్యాన పంట రైతులు తీవ్రంగా నష్టపోయారు. వ్యవసాయ, ఉద్యానశాఖాధికారులు పంట నష్టం అంచనా వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మాడుగుల, చీడికాడ, అనకాపల్లి, రావికమతం మండలాల్లో నాలుగు జెర్సీ ఆవులు మరణించాయి. నాలుగు పక్కా ఇళ్లు, 12 పూరిళ్లు, 9 పూరి గుడెసెలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మరో 86 పూరిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విశాఖ సర్కిల్ పరిధిలో దాదాపు 21 లక్షల రూపాయల నష్టం వాటిల్లింది. 409 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. 33 కెవి ఫీడర్లు, 11 కెవి ఫీడర్లు, 45 కెవి ఫీడర్లు, ఒక 33/11 కెవి సబ్ స్టేషన్, 38 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.



విశాఖలో నీట మునిగిన కెఆర్ఎం కాలనీ

వరి పొలాల్లో వేసిన కుప్పల్లో కూడా నీరు చేరింది. రాయవరం మండలం లింగరాజుపాలెంలోని వీధుల్లో నీరుచేరింది. వరహానది ప్రవాహ ఉధృతికి పలు గ్రామాల్లోకి నీరు చొరబడింది. నక్కపల్లి వీవర్స్ కాలనీ ముంపునకు గురైంది. చేనేత మగ్గాలు, చీరలు, ముడిసరుకు తడిసిముద్దయ్యాయి. ఉద్దండపురంలో బిసి, ఎస్సీ కాలనీలు, లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పర్యటించారు. నక్కపల్లిలో చెరువుకు గండిపడి కాలువ పక్కనున్న చేనేత కాలనీ ముంపునకు గురైంది. యలమంచిలి పట్టణంలో రామారెడ్డిపాలెం వద్ద వంతెన పైనుంచి శేషు కట్టు వాగునీరు పారడంతో పాదచారులు ఇబ్బందిపడ్డారు. దేవరాపల్లి మండలంలో చిన్న నందిపల్లి, కాశీపురంలో పంటనీట మునిగింది. ఆదిరెడ్డిపాలెం వద్ద జివిఎంసి నిధులతో చేపడుతున్న సబ్బవరం పాతరోడ్డు-గుల్లేపల్లి రోడ్డు దెబ్బతింది. యలమంచిలిలో మండల పరిషత్, గురజాడ అప్పారావు డిగ్రీ కాలేజీ ప్రాంగణంలో ముడుకులలోతు మిగతా 2లో..

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

▶ వార్త 2లో..

పిఎన్ఎం ధూంధాం పోస్టర్ ఆవిష్కరణ

▶ వార్త మెయిన్‌లో..

విద్యుత్ సరఫరా త్వరితగతిన పునరుద్ధరణ

▶ వార్త 2లో..

అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 8 నుంచి తలపెట్టిన అంగన్‌వాడీల సమ్మె నేపథ్యంలో బుధవారం సాయంత్రం నగరంలోని ఎల్ఐసి కార్యాలయం దరి అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షురాలు వై.తులసి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదన్నారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.1000 వేతనం ఇస్తామన్న మాట నీటిమూటగానే మిగతా 2లో..

యువగళం ముగింపు సభ స్థల పరిశీలన

ప్రజాశక్తి పిఎం.పాలెం : టిడిపి యువగళం ముగింపు సభకు సంబంధించిన స్థలాన్ని ఆ పార్టీ నేతలు పరిశీలించారు. ఈ మేరకు బుధవారం మారికవలసలోని ఓజోన్ వ్యాలీ రోడ్డులో స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి సమాలోచనలు చేశారు. అక్కడకు వచ్చిన ఏర్పాట్లు గురించి సమీక్ష జరిపిన వారిలో మాజీ మంత్రులు గంటా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణ మూర్తి, టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ చిరంజీవి, పార్టీ భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు, పాసర్ల ప్రసాద్ ఉన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగళం పాదయాత్రను ఈ నెల 17న విశాఖలోని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తుపాను బీభత్సం

నీరు చేరింది. బుచ్చెయ్యపేట మండలం రాజాం ఊటగెడ్డ చెరువు నీరు గ్రామంలో ప్రవహించడంతో రోడ్లు జలమయమయ్యాయి. ఆర్.భీమవరం వద్ద కొండగట్టు ఉధృతంగా ప్రవహించడంతో కొట్టుకుపోయిన ఇద్దరు చిన్నారులను స్థానికులు రక్షించారు. పెద్దేరు జలాశయం నీరు విడిచిపెట్టడంతో వడ్డాదిలో నూతనంగా నిర్మించిన కాజ్‌వే పై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నర్సీపట్నం నుంచి వచ్చే వాహనాలను బంగారం మెట్ట, పోతనపూడి, వడ్డాది మీదుగా చోడవరం మళ్లించారు. చోడవరం నుంచి వచ్చే వాహనాలను గౌరీపట్నం, వడ్డాది మీదుగా నర్సీపట్నం మళ్లించారు. నర్సీపట్నంలో కాలువలు దెబ్బతినడంతో మురుగునీరు రోడ్లపైకి చేరింది. పరవాడలో ఊటచెరువు గట్టు గండిపడింది.

విశాఖలో వీధులు జలమయం

విశాఖ నగరంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సింహాచలం నుంచి విజనగిరిపాలెం వెళ్లే ప్రాంతంలో విద్యుత్ వైర్లు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఆరిలోవ కొండవాలు ప్రాంతంలోని బిసి కాలనీలో రిటర్నింగ్ వాల్ కూలిపోయింది. మూడు ఇళ్లపై మట్టిపెళ్లలు పడిపోవడంతో శ్లాబ్‌లపై ఉన్న వాటర్ ట్యాంకులు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. కెఆర్ఎం కాలనీ పూర్తిగా నీట మునిగింది.

అప్రమత్తంగా ఉండండి : మేయర్

విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురం ఎర్రగెడ్డ లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి కోరారు. బుధవారం ఆమె ఐదో జోన్ జ్ఞానాపురం ఎర్రిగెడ్డ ప్రాంతాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్ఞానాపురం ఎర్రిగెడ్డలోని పూడికలు ఎప్పటికప్పుడు తొలగించినందువల్ల వర్షపు నీరు సాఫీగా వెళ్తోందన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో రెండు జెసిబిలు పనిచేస్తున్నాయని, ఆరు వాహనాలతో 22 ట్రిప్పులు వ్యర్థాలను కాపులుప్పాడ తరలించడం వల్ల ముంపు లేకుండా ఉందని తెలిపారు.

ఎంవిపి.కాలనీ : మేయర్ హరి వెంకట కుమారి 21వ వార్డు చిన్న వాల్తేరులోనూ పర్యటించారు కోటక్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో వ్యర్థాలు అధికంగా ఉండడం గమనించి శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి

మిగిలిందన్నారు. సుప్రీంకోర్టు అంగన్ వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని తీర్పునిచ్చినా బేఖాతరు చేయడం దారుణమన్నారు. లబ్ధిదారులకు నాసిరకమైన సరుకులు సరఫరా చేయడం, అనవసరమైన యాప్ వర్క్‌లు రుద్దడం, నెట్ సౌకర్యం లేకపోవడం, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చకపోవడం, అద్దె బకాయిలు, టిఎ, డిఎలు చెల్లించకపోవడం, రిటైర్‌మెంట్ వయస్సును 62 సంవత్సరాలకు పెంచకపోవడం శోచనీయమన్నారు. ఆయాల నియామకాల్లో రాజకీయ జోక్యం అరికట్టకపోవడం మొదలైన అంశాలపై పలుమార్లు చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఈ నెల 8 నుంచి సమ్మెకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షురాలు పి.మణి, నాయకులు నజ్మా, పార్వతి, అరుణ, లక్ష్మి పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు

ఐసిడిఎస్ రక్షణ కోసం, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి జరుగుతున్న నిరవధిక సమ్మెకు సిఐటియు విశాఖ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై రోజు రోజుకూ పనిభారం పెంచుతోందన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

యువగళం ముగింపు సభ స్థల పరిశీలన

భీమిలి నియోజకవర్గంలో ముగించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఆ కార్యక్రమానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా వస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బహిరంగ సభలో చంద్రబాబు నాయుడుతో సహా రాష్ట్రంలోని ప్రముఖులంతా పాల్గొనున్నారు.

గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీలో భారత్ ఉజ్వల యోజన పథకం కింద రాయితీ ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్లు 27 మంది మహిళా లబ్ధిదారులకు తర్లువాడ గ్రామ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి దేవి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రూ.6 వేలు విలువచేసే గ్యాస్ కనెక్షన్లను సబ్సిడీ ద్వారా రూ.600కే గృహిణులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోనూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్దా తలపెట్టిన దీక్షలు ఉద్యమ స్ఫూర్తితో సాగుతున్నాయి. ఓ వైపు తుపాను భయపెడుతున్నా వెరవకుండా కార్మికులు, ప్రజలు ఈ దీక్షా శిబిరాలకు తరలివచ్చారు.



జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు బుధవారానికి 979వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి అనుబంధ పోర్టు ట్రస్ట్ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం స్థాపించలేదని, అటువంటప్పుడు దాన్ని అమ్మే అధికారం ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్లనే దేశం ప్రగతి మార్గంలో నడుస్తోందని తెలిపారు. విశాఖపట్నం, ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధికి ఎంతగానో దోహదపడ్డ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కార్మిక, ప్రజా సంఘాల ఐక్యతతో అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. దీక్షల్లో జి.చందు, గురు ప్రసాద్, వెంకటరావు, సత్యనారాయణ, మంజుల, శాంతి, అప్పారావు, శ్రీను పాల్గొన్నారు.

ఉక్కునగరం : కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షలు బుధవారానికి 1028వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఫ్ఎండి, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సిఎంఇ, విఎస్‌జిహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, కారు రమణ, రామకృష్ణ, దాసరి శ్రీనివాస్, సిహెచ్.సన్యాసిరావు మాట్లాడారు. తొలుత దీక్షా శిబిరంలోనే అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ మహనీయుని స్ఫూర్తితో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకునేందుకు పోరాటం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గుమ్మడి నరేంద్ర, ఇ.శ్రీనివాసరావు, వరసాల బాలకృష్ణ, గంగవరం గోపి, జిఆర్‌కె.రాజు, వెంకటరావు పాల్గొన్నారు.

నేడు జనసేనలోకి సుందరపు వెంకట సతీష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ రియల్టర్ సుందరపు వెంకట సతీష్ కుమార్ గురువారం మధ్యాహ్నం 3:30 గంటలకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరనున్నారని ఆ పార్టీ నాయకులు పంచకర్ల రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఎఎస్.రాజా మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు పవన్ కల్యాణ్ విశాఖ చేరుకుంటారని, మొదటగా నోవటల్‌కు వెళ్లి మధ్యాహ్నం 3:30 గంటలకు ఎంవిపి.కాలనీలోని ఎఎస్ రాజా మైదానానికి చేరుకుంటారన్నారు. అనంతరం అక్కడ జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ సోదరుడు సుందరపు వెంకట సతీష్ కుమార్ అతని అనుచరులతో జనసేనలో చేరనున్నారని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో పవన్ ప్రసంగిస్తారని తెలిపారు. తెలంగాణా ఎన్నికల అనంతర పరిణామాలు, మిచౌంగ్ తుపాను ప్రభావంతో రైతుల కష్టాలు గురించి ఆయన మాట్లాడే అవకాశం ఉందన్నారు. సభ అనంతరం స్థానిక నాయకులతో పవన్ ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు.

పార్టీ యలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ బహిరంగ ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు కోనా తాతారావు, పసుపులేటి ఉషాకిరణ్, బొడ్డేపల్లి రఘు, పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను త్వరితగతిన పునరుద్ధరిస్తున్నాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరా ఎక్కడ ఆగినా వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు ఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృధ్వీతేజ్ తెలిపారు. ఇంధన శాఖ కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎక్కువ నష్టం సంభవించిన నెల్లూరు జిల్లాకు సహకరించేందుకు మంగళవారం తరలి వెళ్లిన ఆయన గూడూరు తదితర ప్రాంతాల్లోని సిబ్బందితో సమీక్షలు నిర్వహించారు. తిప్పగుంటపాలెం, చెందోడు, కోట, వెనుగుంటపాలెం, మామిడికాలువ తదితర ప్రాంతాల్లో బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని పరిశీలించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సలహాలిచ్చామన్నారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో ప్రధానంగా నష్టం ఏర్పడిన రాజమండ్రి, ఏలూరు, విజయనగరం సర్కిళ్లలో ఐదు పట్టణాలకు విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించి మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు 395 ప్రత్యేక బృందాలతో సంస్థ సిబ్బంది రేయింబవళ్ళు కష్టపడి పని చేస్తున్నారని వెల్లడించారు.

అంబేద్కర్‌కు నివాళి

ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్, చీఫ్ జనరల్ మేనేజర్లు అచ్చి రవికుమార్, ఒ.సింహాద్రి, వి.విజయలలిత, డి.సుమన్ కల్యాణి, బి.రామచంద్రప్రసాద్, ఎస్.మసిలామణి, ఎం.రామకృష్ణ, ఎం.రవీంద్ర, సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

65వ వార్డు సమస్యలపై మేయర్‌కు వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డులోని ప్రధాన సమస్యలపై మేయర్ గొలగాని హరివెంకట కుమారికి వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కెఎల్.రావు నగర్ మీదుగా 12 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే దారిలో ప్రధాన గెడ్డపై ఉన్న కల్వర్టును ఆధునికీకరించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వార్డులోని అన్ని కాలనీల వాడుక నీరు, వర్షం నీరు ఈ గెడ్డనుంచే పారుతుందని, కల్వర్టు పూర్తిగా దెబ్బతినడంతో రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ వివరించారు. గతంలోనూ ఈ సమస్యను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని మేయర్ హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్లు జైలు శిక్ష

ప్రజాశక్తి-లీగల్ : ఒక వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో ముద్దాయి నాగమల్లి యల్లాజీకి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2000 జరిమానా విధిస్తూ రెండవ ఎడిజె కోర్టు న్యాయమూర్తి ఎం.వెంకటరావు తీర్పునిచ్చారు. 2016లో దొండపర్తిలో జరిగిన ఓ వివాదంలో ఎల్.రాజేష్‌పై నాగమల్లి యల్లాజీ డ్రింక్ బాటిల్‌తో దాడిచేశాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రాజేష్ నాలుగో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. నాగమల్లి యల్లాజీపై రౌడీషీట్ ఉంది. ఇదివరకే 15 కేసులు నమోదయ్యాయి.

నేరాల నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : నేరాల నియంత్రణపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నార్త్ నేర విభాగం సిఐ సురేష్, స్థానిక క్రైమ్ ఎస్ఐ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు విద్యార్థులు, యువత, పోలీసులకు సహకరించాలని కోరారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గాజువాక : కూర్మన్నపాలెం దళిత కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన దువ్వాడ బ్రిడ్జి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గాలి ఆనంద్ డాక్టర్ జోన్నకోటి విజయకుమార్, బత్తిన సత్తిబాబు, బి.ఎ.స్వామి, మిరియాల శ్యామ్ పాల్గొన్నారు. జివిఎంసి 76వ వార్డులో వైసిపి నాయకులు మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నడుపూరు సత్యానందం, రామ్మోహనరావు, మంత్రి గోపి, కొవిరి అవతారం, పరమేశ్వరి, భవాని, పల్లం గోపి, పంతం అప్పలరాజు పాల్గొన్నారు. 87వ వార్డు పరిధి కణితి అంబేద్కర్ కాలనీలో విగ్రహానికి వైసిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, మార్పు శేషు, దుగ్గపు దానప్పలు, ప్రగడ శ్రీనివాస్, బోండా గోవిందరాజులు పాల్గొన్నారు.

వేపగుంట : 52వ వార్డు పరిధి శాంతినగర్‌లోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జియ్యాని శ్రీధర్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఎస్.కృష్ణ (అల్ఫా కృష్ణ), జియ్యాని మారుతి, వెదుళ్ల శ్రీను, శ్రీదేవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎయు : ఎయు పరిపాలనా భవనం వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య కె.సమత పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ప్రిన్సిపల్ ఆచార్య ఎ.నరసింహారావు, వి.విజయలక్ష్మి, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య టి.షారోన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : పెందుర్తి ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి మధుపాడ నాగమణి, నియోజకవర్గ దళిత నాయకుడు డుంబారు రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ముమ్వల వెంకటరమణ, కాకర నూకరాజు, ధోని అప్పారావు, నంబూరి నాయుడు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరం సెక్టార్-6లోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ వర్క్స్ ఎన్‌వి.స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సంజీవరావు, తిరుపతి బోండా తౌడన్న, బయ్యే మల్లయ్య, మోహన్‌బాబు, పుల్లారావు, కెవి.రత్నం, ఎస్.సత్యనారాయణ, పరమటి సత్యనారాయణ, దాసరి సురేష్‌బాబు, కర్రప్రకాష్, ఎల్‌వి.రమణారావు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెంలోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. 87వ వార్డులోని లక్ష్మీపురం కూడలి, కణితి అంబేద్కర్ కాలనీ, పాత వడ్లపూడి అంబేద్కర్ పార్కు ప్రాంతాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు వార్డు వైసిపి ఇన్‌ఛార్జి కోమటి శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాటూరి శ్రీనివాసరావు, చింత గుంజయ్య, జెర్రిపోతుల ఈశ్వరావు, కోమటి రమాదేవి, బత్తుల సర్వేశ్వరావు, పోలేటి సూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : పెదగదిలి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి టిడిపి పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు బుడుమూరు గోవింద్ ఆధ్వర్యాన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడి సత్యం, ఒమ్మి అప్పలరాజు, ఒమ్మి పోలారావు, తురకపూడి బాలస్వామి, నల్ల ఈశ్వరరావు, రేఖా జ్యోతి, డోల భవిరీడు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక బార్ అసోసియేషన్ ఛాంబర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.జనార్ధనరావు, కార్యదర్శి సూరిబాబు, కోశాధికారి ముమ్మిడి శెట్టి సునీల్, న్యాయ వాదులు పోలిశెట్టి వెంకటేశ్వర రావు, ఎజిపి పాత్రుడు, బి.ఈశ్వరరావు, మధు, అరుణ కుమారి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి కార్యాలయం ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు భాగం గోపాల రావు, దళిత సంఘం నాయకులు పి.నరసింగరావు, ఎం.వెంకటశివ, జి.వెంకటరమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎండిఒ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి ఎంపిపి డివిఎస్‌ఎస్‌ఎన్.రాజు, దాకమర్రి ఎంపిటిసి సభ్యులు చెల్లూరి నగేష్‌బాబు, ఇఒపిఆర్‌డి జి.అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షులు గాడు శ్రీను తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

తగరపువలస జంక్షన్‌లో అంబేద్కర్



పూలమాల వేస్తున్న భీమిలి ఎంపిపి వాసురాజు తదితరులు

విగ్రహానికి దళిత సంఘం నాయకులు ఎన్ రాజు, ఉప్పాడ నాగేశ్వరరావు, పందిరి విజయ్‌కుమార్, రామోజీ, సతీష్ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు

పిఎం పాలెం : జివిఎంసి 6వ వార్డు ఎస్‌సి సెల్ అధ్యక్షులు జామి శివ ఆధ్వర్యాన మధురవాడ జోన్-2 కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కనకరాజు సియ్యాద్రి, బొట్ట అప్పలరాజు, డాక్టర్ గాదె రోసిరెడ్డి, పోతిన సురేష్, గుంటుబోయిన సంజీవ్‌యాదవ్, రాయన సాయి, పిల్లా రమణ బాబు, ముచ్చు రామారావు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో అంబేద్కర్ విగ్రహానికి ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యాన పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ, మరుపిళ్ల చిన్నయ్యపాత్రుడు, పివివి.ప్రసాదరావు పట్నాయక్, మీసాల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేములవలస జంక్షన్లో అంబేద్కర్ విగ్రహానికి ఆనందపురం మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమ్మెద అప్పలసూరి, సభ్యులు చెన్నా సత్యం, భీమిలి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ ఎర్ర దేవి, అప్పలనాయుడు ఆధ్వర్యాన పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి సమన్వయకర్త కెకె.రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కటుమూరి సతీష్, అల్లు శంకరరావు, కెవిఎన్ శశికళ, రెయ్యి వెంకటరమణ, ఆళ్ల లీలావతి, బర్కత్ అలి, సేనాపతి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కెవిపిఎస్ నివాళి

విశాఖ కలెక్టరేట్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు కెవిపిఎస్ విశాఖ జిల్లా కమిటీ నివాళ్లర్పించింది. ఈ సందర్భంగా డిఎస్‌ఎంఎం జాతీయ నాయకులు భాగం లక్ష్మి, కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుకోటి చిరంజీవి, జిల్లా అధ్యక్షులు మద్దెల సుబ్బన్న, జిల్లా సంయుక్త కార్యదర్శి ముద్దాడ వరప్రసాద్ మాట్లాడారు. మతతత్వ పార్టీలు భారత రాజ్యాంగానికి ముప్పు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్న నేటి తరుణంలో భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. కేంద్ర బిజెపి సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం ద్వారా దళిత, గిరిజనులకు ఉద్యోగాలు లేకుండా చేయాలని చూస్తోందన్నారు. నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారా వారిని విద్యకు దూరం చేయాలని కుట్రలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పైడితల్లి, బి.రత్నం, చిట్టిరాణి, నాగరాజు, కిరణ్, కె.రాజు, విజయ పాల్గొన్నారు.

ఎల్ఐసి కార్యాలయ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జి ఎన్ జె . అచ్యుత రావు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : అఅంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, నాయకులు యాదగిరి శేషు పాల్గొన్నారు.

కొత్తకోట : రావికమతం మండలంలో దొండపూడి, టి అర్జా పురం, రావికమతం, మేడి వాడ గ్రామాలలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహిచారు. కొత్తకోటలో అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహనికి పూలమాలంకరణ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత బహుజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు, ఎం పిటిసి సభ్యులు పూడి దేవ, అంబేద్కర్ సంఘం సభ్యులు బి. బుల్లిబాబు, పూడి అప్పారావు, టి చంటి పూడి యేసు పాల్గొన్నారు..

యస్ రాయవరం : మండలంలోని కొరుప్రోలు గ్రామం దళితకాలనీలో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఘన నివాళి అర్పించారు. స్థానిక నాయకులు చేకూరి శ్రీరామచంద్రరాజు, పోలిశెట్టి పెదఈశ్వర్రావు,అద్దేపల్లి నూకునాయ్డు, కోరా జగదీష్ ,గ్రామ కార్యదర్శి రామలక్ష్మి, విఆర్ఒ వి శ్రీధర్ పాల్గొన్నారు.

గొలుగొండ : .అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా మండలంలోని జోగంపేట కూడలి, పేటమాలపల్లిలో అంబేద్కర్ విగ్రహలకు దళిత సంఘాల నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సిగిలి అచ్చిరాజు, జువ్వల దేముడు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. గొలుగొండలో సర్పంచ్ కసిపల్లి బుజ్జి(అప్పారావు) పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు సిపిఎం ఘన నివాళి

అనకాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అనకాపల్లి రామచంద్ర థియేటర్ వద్ద వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల



నివాళులర్పిస్తున్న సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి లోకనాథం తదితరులు

వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ సామాజిక న్యాయం కోసం జీవితాన్ని త్యాగం చేసి మనకు ఇచ్చిన రాజ్యాంగాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తుంగలోకి తొక్కాలని చూస్తుందని విమర్శించారు. రాజ్యాంగాన్ని కాదని మనుధర్మ సిద్ధాంతాన్ని, అగ్రకుల దురహంకారాన్ని ప్రజలపై రుద్దడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. రాజ్యాంగం పరిరక్షణకు, అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రభుత్వాలపై పోరాడడమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు గండి నాయనబాబు, కె.ఈశ్వరరావు, సిహెచ్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

పరవాడ : ఐద్వా అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు పి మాణిక్యం ఆధ్వర్యంలో పరవాడ గర్ల్స్ హాస్టల్‌లో బుధవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, వందమంది విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతీయ సమాజానికి దార్శనికుడని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కొనియాడారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యావేత్తగా రాజ్యాంగ నిర్మాతగా, న్యాయవాదిగా, సామాజిక సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన పేరుగాంచారన్నారు. అంబేద్కర్ కలలు కన్న సమ సమాజ నిర్మాణానికి మన వంతుగా కృషి



ఉక్కునగరంలో....

చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి. దయానిధి, సిపిఓ జి రామారావు, సోషల్ వెల్ఫేర్ డిడి అజయ్ బాబు, డివిఎంసి మెంబర్ బి. అప్పారావు తదితరులు పాల్గొన్నారు. విజయరామరాజుపేట ఏఎంసి కాలనీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నేత మల్ల సురేంద్ర, నెహ్రూ చౌక్ జంక్షన్లో దూలం బూసిరాజు ఆధ్వర్యాన నివాళులర్పించారు.

కశింకోట : మండలంలోని పల్లపు సోమవారం గ్రామంలో తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతుల శ్రీనివాసరావు అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాలలు అర్పించారు. బయ్యవరం గ్రామంలో ఉగ్గిన రమణ మూర్తి చెట్టు పిల్లి అప్పలనాయుడు ఎస్.కె బాబర్, బరుకు గంగరాజు పాల్గొన్నారు

దేవరాపల్లి : అంబేద్కర్ యూత్ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ కాలనీలో, నాలుగు రోడ్లు కుడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాటపల్లి అప్పారావు, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ మాలి బాబు పాల్గొన్నారు. తెనుగుపూడి గురుకుల పాఠశాలలో అంబేద్కర్ విగ్రహానికి పాఠశాల ప్రిన్సిపల్ కేవీఎల్ఎన్ నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కె.కోటపాడు : బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గౌరవించి ఆచరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సబ్ రిజిస్ట్రార్ బంగారి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక సబ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ప్రొఫెసర్. డి. సూర్యప్రకాశరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసకపల్లి ఎస్‌సి కాలనీలో దువ్వు మనోహర్, వంకర నారాయనమ్మ, మొగలిపురంలో ఐడి.బాబు, టీడీపీ నేత గండి రవికుమార్, సర్పంచ్ గండి అరుణ, ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ నివాళులర్పించారు.

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంలో ఎపి దళిత వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాని, అనకాపల్లి శ్రీనివాసరావు తదితరులు అంబేద్కర్‌కు నివాళులర్పించారు.

చోడవరం : స్థానిక అంబేద్కర్ భవనలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసరావు, ఎర్రంశెట్టి వరప్రసాద్, జంజుర అప్పారావు, ఎర్రంశెట్టి సాగర్ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : స్థానిక సంత బయలు లో గల అంబేద్కర్ విగ్రహానికి వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఆడారి గణపతి అచ్చం నాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.

పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకెలపాలెం ఎస్సీ కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అప్పికొండ వెంకటరమణ, నర్సింగరావు, కృష్ణ, తెరపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

హృద్రోగులను రక్షించడానికి సిపిఆర్ దోహదం

ప్రజాశక్తి -మధురవాడ : హృద్రోగులలో గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు ప్రాణాలు కాపాడడానికి హృదయ శ్వాసకోశ పునరుజ్జీవన చర్య (కార్డియో పల్మనరి రిస్సుసైటేషన్) ఉపయోగపడుతుందని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య నిపుణులు తెలిపారు. గుండె పోటు మరణాలు పెరుగుతున్న నేపథ్యంలో జిమ్సర్ ఆసుపత్రి వైద్య కళాశాలలో సిపిఆర్ టెక్నిక్‌లపై సాధారణ ప్రజలకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేంద్రమంత్రి మన్‌శుఖ్ మాండవీయ ఆన్‌లైన్‌లో ప్రసంగించారు. అనంతరం జిమ్సర్ డీన్ డాక్టర్ ఎస్‌పి.రావు మాట్లాడుతూ వైద్య రంగంలోని వారే కాకుండా సాధారణ ప్రజలు సైతం సిపిఆర్ పట్ల అవగాహనతో ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కమ్యూనిటీ మెడిసెన్ నిపుణులు డాక్టర్ రమణరావు మాట్లాడుతూ, ప్రపంచంలో ప్రతి రోజూ గుండె పోటు కారణంగా 1.15 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు సిపిఆర్ పద్ధతి తెలిసిన వారి సంఖ్య భారత దేశంలో అతి తక్కువగా ఉన్న కారణంగా మరణాలు పెరుగుతున్నాయన్నారు. జిమ్సర్ ఎమర్జెన్సీ విభాగం వైద్యనిపుణులు డాక్టర్ భవ్య మాట్లాడుతూ, గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు వెంటనే సిపిఆర్ ప్రారంభించడం వల్ల కృత్రిమంగా ఆక్సిజన్‌తో కూడిన రక్తం మెదడుతో పాటు అన్ని అవయవాలకు ప్రసరిస్తుందని తద్వారా మెదడు పాడవకుండా ఉంటుందన్నారు. గీతంలోని బోధనేతర సిబ్బందికి, ఆసుపత్రికి వచ్చిన ప్రజలకు సిపిఆర్ పై అవగాహన కల్పించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



మాట్లాడుతున్న తిప్పల దేవన్‌రెడ్డి

ప్రజాశక్తి -గాజువాక : క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని వైసిపి గాజువాక నియోజవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. గాజువాకలోని శ్రీ సూర్య జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవాన్ని నడుపూరు జివిఎంసి కల్యాణ మండపంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి దేవన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థీ నైపుణ్యంపై దృష్టిపెట్టాలని కోరారు. కష్టపడి చదువుకున్న వారికే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు గుడివాడ శ్రీనివాసరావు, కార్పొరేటర్ రాజాను రామారావు పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో జోన్ పరిధి తగరపువలస, హైవే, బంగ్లామెట్ట తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లపై ఉన్న పలు ఆక్రమణలను పట్టణ ప్రణాళిక విభాగం ఎసిపి డి.శ్రీనివాస్ ఆధ్వర్యాన బుధవారం తొలగించారు. ఎఎంహెచ్‌ఒ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బిసి రోడ్డులో భారీ వాహనాల పార్కింగ్ నిలువరించాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : బిసి రోడ్డులో అదాని గంగవరం పోర్టు భారీ వాహనాల నిలుపుదలను నివారించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ సేఫ్టీ అధికారికి వైసిపి నాయకులు పిట్ట రెడ్డి బుధవారం వినతిపత్రం అందజేశారు. అదాని గంగవరం పోర్టు బిసి గేట్ దగ్గర వంతెన నుంచి సీతానగరం కొండ వరకు భారీ వాహనాలు నిలుపుదల చేయడంతో రాత్రి సమయంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు వచ్చేటప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. పెదగంట్యాడ, గాజువాక నుంచి వేలాదిమంది ఉద్యోగస్తులు ఈ రోడ్డు వెంబడి ప్రతిరోజు ప్రయాణిస్తున్నారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రమ, పెట్టుబడి నీటి పాలు

- ▶▶ దిక్కు తోచని స్థితిలో రైతాంగం
- ▶▶ ఆదుకోవాలంటున్న రైతులు



టి.నగరపాలెంలో నీట మునిగిన పంటను పైకి ఎత్తుతున్న రైతులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : 'ఆగస్టులో వరి పంట వేశాను, సంక్రాంతికి పంట చేతి కొస్తాది అనుకుంటే వర్షం ఇలా అన్యాయం చేసింది' అంటూ 15 ఎకరాల కౌలు రైతు సుబ్బారావు వాపోయారు.

'తుపాను వరి పంటను చాపలా నేల మట్టం చేసేసింది' అంటూ నాలుగెకరాల రైతు సారి అప్పారావు ఆవేదన.

'కోసిన పంట కుప్పలుగా పెట్టాం. నూర్చిన ధాన్యం తడకుండా పరదాలు, టార్పన్లు కప్పాం, అయితే కుప్పలు కిందకు వర్షం నీరు వెళ్తుంటే ఆందోళనగా ఉంది' అన్నారు ఐదెకరాల రైతు తమ్మిన రైతు వెంకట రమణ పాత్రుడు.

'ఎకరాకు సుమారు రూ.30 వేలు నుంచి రూ.35 వేలు పెట్టుబడి పెట్టాను. ఇదంతా నీటి పాలు అయింది' అంటూ వాపోయారు 1.5 ఎకరాలున్న రైతు పొట్నూరు లక్షణరావు. వీరంతా భీమిలి మండలం టి.నగరపాలెం, తాటితూరు గ్రామాల రైతులు.

పెట్టుబడి నీటి పాలు...

ఆకులు, దమ్ములు, ఉడుపులు, కలుపు, ఇప్పుడేమో నూర్పునకు పెట్టుబడి పెట్టిన రైతులకు చేతికి రావాల్సిన పంట కళ్లెదుటే నీటి పాలు కావడంతో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నాయి. దిగుబడులు, రాబడి తగ్గిపోతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవసాయ భారంగా మారిందని అంటున్నారు రైతులు.

ఏటా పెరుగుతున్న పెట్టుబడులు..

ఏ యేటి కాయేడు పంటలపై పెట్టుబడి పెరుగుతోంది. డిఎపి బస్తా గతేడాది రూ.1150, ఈ ఏడాది రూ.1350, సూపర్ ఫాస్ఫేట్ రూ.450 నుంచి రూ.650, పొటాష్ రూ.700 నుంచి ఏకంగా రూ.1800, యూరియా రూ.220 నుంచి రూ.280కి పెరిగాయి. ఇంకా కూలీలకు ఇచ్చే ఖర్చులు కలుపుకుంటే ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయని రైతులు చెబుతున్నారు.

దిగుబడిపై దిగులు...

కల్లాల్లో వేసిన తడిసిన ధాన్యం ఏ ధరకు కొంటారో? ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు ఎ గ్రేడ్, 1120 రకం ధాన్యం రూ.2,203, ముతక ధాన్యం రూ.2,183 ప్రకటించారు. ఇప్పుడున్న వాతావరణ పరిస్థితిలో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధరకే కొని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఏం చేయాలో తోచడం లేదు..


తనతో పాటు మరో నలుగురం కలిసి 15 ఎకరాలు కౌలుకు సాగు చేస్తున్నాం. వర్షానికి 4 రోజుల ముందే 1121 రకం వరి నూర్పులు చేసి ట్రాక్టరుతో కల్లంలోకి తీసుకొచ్చాం. సుమారు 350 బస్తాల ధాన్యం ఉండే అవకాశం ఉంది. ట్రాక్టర్‌కు రూ.8,500 ఇచ్చి 2 ట్రిప్పుల్లో కల్లానికి చేర్చాం. ధాన్యం పైకప్పేందుకు టార్పన్ ఒక్కోటి రూ.2వేలు చొప్పున 3 టార్పన్లు కొన్నాం.



వి.సుబ్బారావు, రైతు
టి నగర పాలెం.
భీమిలి మండలం

చేతి కొచ్చే సమయంలో నీటి పాలు

పంట చేతికొచ్చే సమయంలో ఇలా నీటి పాలు అయింది. అప్పులు చేసి పంటపై పెట్టుబడి పెట్టాను. 150 బస్తాల వరి పంట కోసి 3 కుప్పలుగా పెట్టాను. టార్పన్లు కప్పినా కిందనుంచి నీరు వస్తోంది. నూర్చిన ధాన్యంపై టార్పన్ వేశాను. అయినా నీరు వస్తోంది. కోసిన తర్వాత దుబ్బులు కూడా పూర్తిగా నీట మునిగాయి. పశువుల మేతకు కూడా గడ్డి లేని పరిస్థితి.



తమ్మిన వెంకటరమణ పాత్రుడు
రైతు, తాటితూరు
భీమిలి మండలం.

ఘనంగా వైదాడ ధర్మారం వర్ధంతి



వైదాడ ధర్మారం చిత్రపటానికి పూలమాల వేస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి -ములగాడ : ఆదర్శమూర్తి, మహిళా మణిపూస వైదాడ ధర్మారం 23వ వర్ధంతిని సిపిఎం మల్కాపురంజోన్ కమిటీ ఆధ్వర్యాన బుధవారం ఘనంగా నిర్వహించారు. వైదాడ ధర్మారం చిత్రపటానికి 58వ వార్డు పరిధి గుల్లలపాలెంలో టి.శ్యామల, 59వ వార్డు నెహ్రూనగర్‌లో ఊర్వశమ్మ, 63వ వార్డు క్రాంతినగర్‌లో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, ధర్మారం గుల్లలపాలెంలోనే కాకుండా మహిళా సంఘం (ఐద్వా), బాలలసంఘాలను విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసి, గ్రామంలో ప్రజల సమస్యలు, మహిళపై దాడులకు వ్యతిరేంగా పోరాడారని గుర్తుచేశారు. మహిళలను ఐక్యంచేసి మధ్యపాన నిషేధం, విద్యుత్ చార్జీల పెంపు వ్యతిరేక పోరాటాలను ముందుండి నడిపించారని తెలిపారు. ఆదర్శమూర్తి వైదాడ ధర్మారం గుల్లలపాలెం గ్రామంలో గర్భవతులకు పురుడు పోసేవారని, మహిళ సంఘం ఆఫీసు నిర్మించి అందులో రాత్రు బడులు, స్వయం ఉపాధి కోసం విస్తరాకులు కుట్టడం, పచ్చళ్ల తయారీ వంటివి నేర్పించారని కొనియాడారు. తుదిశ్వాస విడిచే వరకు సిపిఎం మల్కాపురం కార్యాలయానికి వచ్చి కూర్చొనేవారని తెలిపారు. ధర్మారం ఆశయాల సాధనకు నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలపై మనమంతా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, పివి.భాస్కరరావు, జయలక్ష్మి, ఎల్.కృష్ణ, ఐద్వా మల్కాపురంజోన్ అధ్యక్ష కార్యదర్శులు బి.మమత, ఆర్.విమల, వై.కళ్యాణి, డివైఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీను, ఎస్.వాసు, భవన నిర్మాణ సంఘం నాయకులు జె.రామునాయుడు, ఎం.ఆదినాయణ బి.జగ్గునాయుడు ప్రజానాట్యమండలి నాయకులు వై.గంగాధర్, యు.రాజు, కార్యకర్తలు రాజేష్ ,నరేష్ మహేంద్ర, సత్తిబాబు, కిషోర్, మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగపరచుకోవాలి

ప్రజాశక్తి -ఆనందపురం : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలుసుకొని, వాటిని సద్వినియోగపరచుకోవాలని సీనియర్ రీజనల్ డైరెక్టర్, చీఫ్ ఆఫ్ ఎయిర్‌పోర్టు హెల్త్ ఆర్గనైజర్ డాక్టర్ ఎం.అనురాధ కోరారు. ఆనందపురం మండలం బోని గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కేంద్ర పథకాలైన గరిబ్ కల్యాణ్ అన్న యోజన, పిఎం అవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ నిధి, ఉజ్వల యోజన, అయుష్మాన్ భారత్, విశ్వకర్మ యోజన, జల్ జీవన్ మిషన్, కిసాన్ క్రెడిట్ కార్డులు, జన్ ధన్ యోజన, పిఎం స్వనిధి, నారీ శక్తి వందన్ అధినియమ్, జాతీయ విద్యా విధానం, స్కిల్ ఇండియా మిషన్, స్వచ్ఛ భారత్ మిషన్, నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌పై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ లవరాజు అధ్యక్షతన జరిగిన సభలో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రాధాన్యతను వివరిస్తూ పంచాయతీలోని లబ్ధిదారులతో మాట్లాడించారు. అనంతరం కేంద్ర పథకాలతో కూడిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి, ఫ్యామిలీ డాక్టర్ ప్రత్యేక అధికారి డాక్టర్ బి.ఉమావతి, సర్పంచ్ బోని అప్పలకొండ, సన్యాసినాయుడు, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగనాయుడు, సిహెచ్‌ఒ సాంబమూర్తి, క్షయ వ్యాధి విభాగం సూపర్‌వైజర్ బ్రహ్మం, వెంకటరమణ, డిజిటల్ అసిస్టెంట్ మీనా, నాయకులు కంటుబుక్త రామానాయుడు, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 38 మందిపై కేసు నమోదు చేసి భీమిలి కోర్టుకు తరలించగా భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటీ మెజిస్ట్రేట్ బి.విజయలక్ష్మి ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. కమ్యూనిటీ సర్వీస్‌లో భాగంగా మందుబాబులతో భీమిలి ప్రభుత్వ హాస్పిటల్, బస్ స్టాండ్ పరిసరాలను పరిశుభ్రం చేయించారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మన్యాలపేటకు చెందిన బాలాజీ మృతిచెందడంతో ఆయన తల్లిదండ్రులకు స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి బుధవారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

డిసిఐలో రక్తదానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యాన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) కార్యాలయంలో ఉద్యోగులు బుధవారం రక్తదానం చేశారు. కార్యక్రమంలో విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ క్లబ్ అండ్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ ఎస్ రాజకుమారి, కందాళ ఛాయా, సురేష్, విశాల్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జియ్యాని

ప్రజాశక్తి-వేపగుంట : 52వ వార్డు పరిధి మర్రిపాలెం ఉడా లే-అవుట్‌లో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద ఘటనా స్థలాన్ని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం పరిశీలించారు. 52వ వార్డు తెలుగుదేశం అధ్యక్షులు మందలపు వాసుదేవరావు ఇంట్లో మంటలు చెలరేగి విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. అధికారులతో కలిసి శ్రీధర్ ఆ ఇంటిని పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతును నిండా ముంచిన మిచౌంగ్

- వరి పొలాల్లో మోకాళ్లోతు నీరు
- లబోదిబోమంటున్న అన్నదాతలు


చోడవరం మండలంలో నీట మునిగిన వరి చేను

మిచౌంగ్ తుపాన్ కారణంగా మూడు రోజులుగా ఎకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వరి పంటలు నీటమునిగాయి. మోకాళ్లోతులో వరి పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో కోత దశకు వచ్చి నేలమట్టమైన వరి చేను, కోసి పొలంలో ఆరబెట్టిన పనలు నీట మునిగి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.


బుచ్చయ్యపేట మండలంలో చెరువును తలపిస్తున్న పంట పొలం

ప్రజాశక్తి-చోడవరం

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో లక్ష్మీపురం, నరసయ్య పేటలోని పల్లపు భూముల్లో నీరు చేరి వరి పంట నీట మునిగింది. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పంట నేలకొరిగింది. పంట చేతికందే సమయంలో నీటి పాలవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కశింకోట : భారీ వర్షాలకు మండలంలోని ఏనుగుతుని, చింతలపాలెం, గొబ్బూరు, సోమవారం, అడ్డాం, వెదురుపర్తి, బుచ్చియ్యపేట, కశింకోట తదితర గ్రామాల్లో వరి, చెరుకు పంట మునిగాయి. మండలంలోని 246 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారి స్వప్న తెలిపారు.

బుచ్చయ్యపేట : తుఫాను నేపథ్యంలో మండలంలో సుమారు 3000 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగిపోయింది. వడ్డాది, చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, నీలకంఠాపురం, రాజాం, తురకలపూడి, పెదపూడి తదితర గ్రామాల్లో వరి పంటల మీదుగా మోకాళ్లలోతులో వర్షపు నీరు ప్రవహించింది. అరటి, చెరకు పంటలు, ఆకు కూరగాయలు, పుచ్చకాయల పంటలు దెబ్బతిన్నాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

దేవరాపల్లి : భారీ వర్షాలకు పొలాల్లో కోసిన పంటలు నీటి తేలిపోయాయి. నీట మునిగి వర్షానికి తడిసి గాలికి నేలమట్టమైన వరి పొలాలు సుమారు 600 ఎకరాలు ఉంటాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలియజేశారు.


దేవరాపల్లి మండలంలో నీటిపై తేలిన వరి పనలను ఒడ్డుకు మోస్తున్న రైతు

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి టమాటా, వంగ, బెండ, బీర వంటి కూరగాయల పంటల్లో నీరు నిల్వ ఉండడంతో అవి కుళ్ళి పోయాయి దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారి వైకాంతమ్మ మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులు దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి సమస్యలు తెలిపి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.


బుచ్చయ్యపేట మండలంలో నీట మునిగిన వరి పనలను చూపుతున్న రైతు

ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం
- ముంపునకు గురైన పొలాలను పరిశీలించిన సిపిఎం, రైతు నేతలు


ఆవఖండంలో నేలమట్టమైన వరి పంటను పరిశీలిస్తున్న లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

మిచౌంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు రూ.30వేలు చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అనకాపల్లి మండలం ఆవఖండంలోని ముంపునకు గురైన వరి పొలాలను లోకనాథం నేతృత్వంలో సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మిచౌంగ్ తుఫాన్ రూపంలో వర్షాలు రావడంతో వరి పంటలు నేలకొరిగాయని, కొన్ని ప్రాంతాల్లో కుప్పలు తడిసి ముద్దాయని తెలిపారు. ధాన్యం మొలకలెత్తే ప్రమాదం ఉందని, నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండలం కన్వీనర్ గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు ఆర్ శంకర్రావు, అల్లు రాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, సిహెచ్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మండలంలోని మునగపాక, తిమ్మరాజుపేట, చూచుకొండ, గణపర్తి తదితర గ్రామాల్లో నీటమునిగిన వరి పొలాలను సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వివి శ్రీనివాసరావు, మండల నాయకులు ఎస్.బ్రహ్మాజీ, ఆళ్ళ మహేశ్వరరావు బుధవారం కౌలు రైతులతో కలిసి పరిశీలించారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి కోత కోసే సమయంలో కళ్ళముందే పంట యావత్తు తుఫాన్ దాటికి నీట మునగడంతో రైతులు కన్నీరు పెట్టుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణమే నీట మునిగిన పంట పొలాలను, దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగిన నష్టపరహారం ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.


అచ్యుతాపురం మండలంలో నేలకొరిగిన వరిను చూపుతున్న రైతు నేతలు

అచ్యుతాపురం : మండలంలోని ఎర్రవరం, కొండకర్ల, హరిపాలెం గ్రామాలలో ముంపునకు గురైన వరి పంటలను బుధవారం సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఆర్ రాము తదితరులు పరిశీలించారు. రైతులకు వాటిల్లిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.రాంకుమార్, కె.సోమునాయుడు, పి.అప్పలనాయుడు, జి.మల్లయ్య, కె.శివ పాల్గొన్నారు.


కె.కోటపాడు మండలంలో నీటిలో ఉన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

రైతు సంఘాల ఆధ్వర్యాన

అచ్యుతాపురం : ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కాండ్రేగుల రామ సదాశివరావు ఆధ్వర్యాన మండలంలోని హరిపాలెం గ్రామంలో బుధవారం మునిగిన పంట పొలాలను పరిశీలించారు. గ్రామంలో 75 మంది కౌలు రైతులు సుమారు 2500 ఎకరాల్లో వరి పంట సాగు చేశారని, అధిక వడ్డీలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టారని, వారికి ఎకరాకు రూ.30వేలు చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాలం నాయుడు, కాండ్రేగుల సత్యనారాయణ, నరసింహమూర్తి పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని మేడిచర్ల, సూరెడ్డిపాలెం గ్రామాల్లో తుఫాను సందర్భంగా మునిగిపోయిన పంట పొలాలను ఎపి రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వనము సూర్యనారాయణ, ఎర్ర దేవుడు, రొంగలి కన్నంనాయుడు, సూరెడ్డి మల్లునాయుడు, చొక్కాకుల దేవుడు, వేముల చిన్నబాబు పాల్గొన్నారు.

తుపాన్‌ను ఎదుర్కొనేందుకు యంత్రాంగం సిద్ధం : బూడి

ప్రజాశక్తి- దేవరాపల్లి

భారీ తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా, మండల యంత్రాంగాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం నిరంతరం అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ, తుఫాను ప్రభావాన్ని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తీరప్రాంతంలో హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా, ఎటువంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాలను సిద్ధంగా ఉంచారని తెలిపారు. వాతావరణ శాఖ సూచనలను బట్టి అయితే భారీ వర్షాలు పడవచ్చన్న సూచనలు మాత్రం ఉన్నాయని, కోతకొచ్చిన వరిపంట నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. తడిచిపోయిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్లో అయినా కొనుగోలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు.

పంటల నష్ట నివారణకు సూచనలు

ప్రజాశక్తి -అనకాపల్లి

మిచౌంగ్ తుఫాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలో అనేక మండలాల్లో వరి పంటతో పాటు ఇతర పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లుంది. ఈ నేపథ్యంలో స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బుధవారం అనకాపల్లి, చీడికాడ, చోడవరం మండలాల్లో పర్యటించారు. వరి పంటతో పాటు ఇతర పంటల నష్ట నివారణకు పలు సూచనలు అందించారు. కోసిన పూర్తిగా ఆరని పనలను కుప్పలు వేసేటప్పుడు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకోవడం వల్ల నష్టాన్ని నివారించుకోవచ్చు. కోత కోసి పొలంలో ఉన్న పనలపై గింజ మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలి. నూర్చిన ధాన్యం రెండు మూడు రోజులు ఎండబెట్టేందుకు వీలు లేకుంటే క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిపి ధాన్యం పోగు పెడితే గింజ మొలకెత్తకుండా చెడిపోకుండా ఉంటుంది. ఎండ కాసిన తర్వాత ఎండబెట్టి తూర్పారబోసి నిల్వ చేసుకోవాలి. కార్యక్రమంలో చెరకు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సరిత, విస్తరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : వర్షాలకు దెబ్బతిన్న వరి పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు లక్ష్మీపురం, దావనపల్లి, మైచర్లపాలెం గ్రామాల్లో పర్యటించి తడిసిన వరి పంటను ఎలా సంరక్షించుకోవాలి అన్న అంశంపై రైతులకు పలు సూచనలు చేశారు. వర్షానికి నడిచిన వరి పనులను గట్లపై తీసుకొచ్చి ఆరబెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సరిత, ఉమామహేశ్వరరావు, ఆదిలక్ష్మి మండల వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు పంపించి వరి పనులపై ఉప్పునీటిని పిచ్చిగారి చేయాలని స్థానిక వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కె.కోటపాడు, ఏ కోడూరు గ్రామాల్లో మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కోతకోయని పొలంలో పంట పడిపోయినట్లయితే వాటిని నిలబెట్టాలని సూచించారు.

కసింకోట : మండలంలోని కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో వరి పంటలను అనకాపల్లి శాఖ వ్యవసాయ శాఖ శాస్త్రవేత్త గౌరీ కుమారి బుధవారం పరిశీలించారు. గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా వున్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి ,వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షానికి తడవకుండా ఆరబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి స్వప్న, ఏఇ ఓ.శ్రీనివాస్ పాల్గొన్నారు


కశింకోట మండలంలో రైతులను సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

హోమ్ గార్డుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు శాఖలో హోంగార్డులు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో బుధవారం 61వ హోమ్ గార్డుల ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్ గార్డుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, నాటుసారా, లా అండ్ ఆర్డర్ కేసులు, చోరీ కేసులో నిందితులు పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఆరుగురు హెూంగార్డులు అర్.రాంబాబు, బాబా షేక్ ముస్కిన్ మదీనా, పి.ఈశ్వరరావు, ఎన్.పైడం నాయుడు, బి.త్రినాధ రావు, ఎస్.సన్నిబాబులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ వి.సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్ఐలు సతీష్, రామకృష్ణారావు, వెంకట్రావు, కోటేశ్వరబాబు, అనకాపల్లి టౌన్ సిఐ మోహన్ రావు, ఎస్సైలు సింహాచలం, సత్యనారాయణ, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జన జాతీయ గౌరవ దినోత్సవం 2023-వికాసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమంబుధవారం మండలంలోని మార్టూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి గొర్లి సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిపి ఎన్నో పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు,ఎంపీటీసీ మిద్దె రాజా రామచంద్రరావు, డిఎంహెచ్వో డాక్టర్ ఎ హేమంత్, ఎంపీడీవో నరసింహారావు, ఈఓపిఆర్డి ధర్మారావు ధర్మారావు,డాక్టర్లు ,ఏపీవో, ఎసిడిపిఓ,వ్యవసాయ అధికారులు, వార్డు మెంబర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్.రావు షాపింగ్ మాల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న ఎంఎస్.రావు షాపింగ్ మాల్ 24వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఇందులో ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా పాల్గొని షాపింగ్ మాల్‌ను సందర్శించారు. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఆఫర్స్‌పై ఆరా తీశారు. అనకాపల్లి ప్రజలకు అందుబాటు ధరలలో వస్త్రాలను అందించాలని ఎంవిఆర్ కోరారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ దంపతులను భారీ గజమాలతో షాపింగ్ మాల్ యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

మూడు గేట్లు ఎత్తి 'పెద్దేరు' నీటి విడుదల

మాడుగుల: తుపాన్ ప్రభావంతో పెద్దేరు జలాశయానికి ఇన్ ఫ్లో పెరిగడంతో బుధవారం ఉదయం మూడు గేట్లు ఎత్తివేసి 3600 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెట్టినట్టు రిజర్వాయర్ జెవి సుధాకర్ రెడ్డి తెలిపారు. తుఫాను ప్రభావంతో క్యాచ్‌మెంట్ ఏరియాలో అధిక వర్షపాతం నమోదు కావడంతో ఇన్‌ఫ్లో పెరిగిందని, అందుకు నీటిని కిందకు విడుదల చేసినట్లు తెలిపారు. రిజర్వాయర్ దిగువునున్న లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. బుధవారం సాయంత్రానికి నీటి ఉధృతి తగ్గే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు.

అంగన్వాడీల సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ : వేతనాల పెంపు, గ్రాట్యూటీ, పెన్షన్ అమలు, ఇతర సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈనెల 8వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు అంగన్వాడీలు తెలిపారు. బుధవారం లింగంపేట సచివాలయం విఆర్ఓ మోహన్, దుర్గకు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సుప్రింకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాట్యూటీని అమలు చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కార్యకర్తలు సత్యవతి, జ్యోతి పాల్గొన్నారు.

8 నుండి సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వడ్డాది : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని దానికి అనుగుణంగా ఈనెల 8 నుండి మండల కేంద్రాల్లో నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షురాలు అమ్మాజీ తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చెయ్యాలని తదితర సమస్యలపై పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచాలని, మినీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా మార్చాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు పెంచాలని, ఆఖరి వేతనంతో 50శాతం పెన్షన్ ఇవ్వాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



శిరీష జ్యోతి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి- కసింకోట

కశింకోట మండలంలో బుధవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ప్రైవేటు స్కూల్ టీచర్, సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ కాంట్రాక్టు కార్మికుడు దుర్మరణం చెందారు. కశింకోట పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కూండ్రం గ్రామానికి చెందిన శిరీష జ్యోతి (26) కసింకోటలోని ప్రైవేట్ పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. రోజు మాదిరిగా బుధవారం ఉదయం మరో మహిళా టీచర్‌ను ఎక్కించుకొని తన స్కూటీపై వస్తుండగా కసింకోట జాతీయ రహదారి ఆర్కే టౌన్‌షిప్ వద్దకు వచ్చే సరికి అనకాపల్లి వైపు నుండి ఎలమంచిలి వైపు వెళుతున్న లారీ స్కూటీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శిరీష జ్యోతి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీపై కూర్చున్న మరో టీచర్ భాగ్యశ్రీ కాలు విరిగిపోయింది. ఆమెను 108 వాహనంలో చికిత్స కోసం అనకాపల్లి తరలించారు. సంఘటన స్థలాన్ని అనకాపల్లి రూరల్ సీఐ రవికుమార్ పరిశీలించారు. కశింకోట అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంట్రాక్టు కార్మికుడు

కశింకోట : కశింకోట మండలం జమాదులపాలెం గ్రామానికి చెందిన ఒమ్మి శ్రీను (46) బయ్యవరం సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో కూలి పనులు చేస్తున్నాడు. మంగళవారం రాత్రి పని ముగించుకొని తిరిగి మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ తున్నాడు. అనకాపల్లి వైపు నుండి ఎలమంచిలి వైపు వెళుతున్న శ్రీను వెళ్తుండగా, అదే రహదారిలో సిగ్నల్స్ వేయకుండా ఆగి ఉన్న ఓ ప్రైవేట్ బస్సును బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో శ్రీను తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎఎస్ఐ సుందరమ్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒమ్మి శ్రీను (ఫైల్‌ఫొటో)

తుపాను ప్రభావిత ప్రాంతంలో తక్షణ సహాయం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి, ఎస్పి మురళీకృష్ణ, ఇతర అధికారులు

ప్రజాశక్తి-అనకాపల్లి

తుపాను ప్రభావిత ప్రాంతంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రవి పటాన్ శెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మండల ప్రత్యేక అధికారులు, తాసిల్దార్లు, ఎంపీడీవోలతో బుధవారం ఎస్పీ మురళీకృష్ణతో కలిసి వెబ్‌ఎక్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, సహాయ కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారికి పరిస్థితిని వివరించి శిబిరాలకు చేర్చాలన్నారు. శిబిరాలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు, నాణ్యమైన భోజనాలు అందాలన్నారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలుంటే వెంటనే వైద్య శిబిరాలకు తరలించాలన్నారు. తుఫాను ప్రభావం తగ్గిన తర్వాత కార్డు లేకపోయినా అందరికీ రేషన్ అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ దయానిధి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ హేమంత్, సిపిఓ రామారావు, మంజుల వాణి, డిపిఓ శిరీష రాణి తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణికి సత్కారం

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి ప్రాంతానికి చెందిన అర్జున్ అవార్డు గ్రహీత ఆకుల శ్రీజ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణిగా రాణించడం ఈ ప్రాంతానికి గర్వకారణమని పలువురు కొనియాడారు. అర్జున్ అవార్డు గ్రహీత ఆకుల శ్రీజ ఆమె తల్లిదండ్రులు ఆకుల ప్రవీణ్ కుమార్-సుధలను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గవర సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు బుద్ధ భూలోక నాయుడు, నూకాంబికా దేవస్థానం మాజీ చైర్మన్ బొడ్డేడ అప్పారావు, కొణతాల ఉమా, లోటస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విల్లూరి రాజేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత కొణతాల పణి భూషణ్ శ్రీధర్, గ్రీన్ క్లబ్ సభ్యులు, గౌరీ సంఘఅయ్యప్ప స్వామి దేవస్థానం స్వామీలు మాట్లాడుతూ శ్రీజ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి త్వరలో జరుగు ఒలింపిక్స్‌లో భారతదేశం తరుపున నుండి బంగారు పతకం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొణతాల ఉమామహేశ్వరరావు, స్వరూప రాణి, డాక్టర్ కొణతాల రామలింగ స్వామి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకురాలు కొణతాల లక్ష్మీపార్వతి, పెంటకోట సురేష్ కుమార్, జగన్, దాడి బుజ్జి, బి సంతోష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీను, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

దొంగ ఓట్లపై మాట్లాడే అర్హత అయ్యన్నకు లేదు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : దొంగ ఓట్లపై మాట్లాడే అర్హత అయ్యన్నకు లేదని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ ఆరోపించారు. విశాఖ, రోలుగుంట మండలం బుచ్చింపేటలోను, తూర్పుగోదావరి జిల్లా అల్లిపూడి, రౌతులపూడి ప్రాంతాల్లో ఉన్న తన కుటుంబ సభ్యులందరిని నర్సీపట్నం నియోజకవర్గంలో దొంగఓట్లుగా నమోదు చేయించారని, వీటిపై దర్యాప్తు చేసి తొలగించాలని బుధవారం నర్సీపట్నం ఆర్‌డిఓ జయరాంకు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దొంగ ఓట్లక సంబంధించి తనపై అయ్యన్న ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. అయ్యన్నపాత్రుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా రాబోయే ఎన్నికల్లో నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో వైసిపి 30వేల మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైసిపి మున్సిపాలిటీ అధ్యక్షులు ఏకా శివ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి : అయ్యన్న

నర్సీపట్నం టౌన్: తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని మాజీ మంత్రి, తెలుగదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కరువుతో ఇబ్బందులు పడ్డ రైతాంగం ఈ తుపాన్ కారణంగా కురిసిన వర్షాలకు తీవ్రంగా నష్టపోయారన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏరియల్ సర్వే కాకుండా స్వయంగా ముంపు ప్రాంతాలను సందర్శించి, పంట నష్టాలపై అధికారులతో సమీక్షించి రైతులను ఆదుకోవాలన్నారు. . తుపాన్‌కు ముందస్తుగా హెచ్చరికలల్లో ప్రభుత్వయంత్రాంగం విఫలం చెందిందన్నారు.

బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని రాజు కోడూరు గ్రామంలో భారీ వర్షానికి కమ్మలిల్లు కారిపోయి పడిపోయే పరిస్థితుల్లో ఉందని, బాధితులు కరణం అప్పారావు, కరణం తాతారావు, కరణం నూకరత్నం కుటుంబాన్ని ఆదుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వారు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎన్.నారాయణ మండల అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ ప్రభుత్వం వీరికి నిత్యవసర సరుకులు ఇచ్చి పునరావస కేంద్రానికి తరలించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

తుపాన్ బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : తుఫాను ప్రభావంతో మండలంలోని తోటాడ గ్రామంలో పూరి గుడిసెలలో నివసిస్తున్న వారి ఇల్లు ధ్వంసం కావడంతో నాగవరం ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు బాధితులకు నిత్యవసర సరుకులను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోటడ జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు కుమార్, ఆడారి ప్రసాద్, టీడీపీ నాయకులు దొడ్డి రమేష్ పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలోని సచివాలయంలో బుధవారం 104 సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ తుపాను ప్రభావం వలన పలు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యుల సూచనల మేరకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితోపాటుగా ఆశా వర్కర్స్, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్ చొరవతో రాకపోకలు పునరుద్ధరణ

గొలుగొండ : మండలంలో ఆరిలోవ అటవీ ప్రాంతంలో తుఫాను ప్రభావంతో కూడిన వర్షాలకు వీచిన గాలిలకు టేకు చెట్టు రోడ్డు అడ్డంగా కూలిపోయింది. వెంటనే స్పందించిన తహశీల్దార్ జి.ఆనంద్ రావు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. తక్షణమే జెసిబిని రప్పించి చెట్టును రోడ్డుకు అడ్డంగా రాకపోకలకు అంతరాయం కలగకుండా తొలగించారు. దీంతో ఉదయం నుంచి నిలిచిపోయిన వాహనాలు తమ ప్రయాణాలు కొనసాగించాయి.

యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా కళింగ సతీష్



ప్రజాశక్తి-రోలుగుంట : అనకాపల్లి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యాలయంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికలలో రోలుగుంట మండలం జగ్గంపేట గ్రామ ఉపాధ్యాయుడు కళింగ సతీష్ జిల్లా కార్యదర్శిగా ఎంపికయ్యారు. మండలం నుండి జిల్లా కార్యదర్శిగా కళింగ సతీష్ ఎంపిక కావడంపై యుటిఎఫ్ మండల కార్యవర్గం, మండల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కాళింగ సతీష్ మాట్లాడుతూఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ నిరంతరం పోరాటం చేస్తోందని, అందులోతాను భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు ప్రాథమిక విద్యా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలిగించే జిఒ 117 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మండల జనరల్ సెక్రటరీ డి.వంశీ, గౌరవ అధ్యక్షులు యు. నాగభూషణం, సహాధ్యక్షులు కె.కేశవరావు, కనక మహాలక్ష్మి, కోశాధికారి బి.భారతి, ఉపాధ్యాయులుతమ అభినందనలు తెలియజేశారు.

తుపాను నష్ట ప్రాంతాల్లో పరిశీలన



సింగనబందలో నేలవాలిన పైర్లు పరిశీలిస్తున్న ముత్తంశెట్టి



బుచ్చయ్యపేటలో నీటి ముంపులో ఉన్న వరిపైర్లు పరిశీలిస్తున్న టిడిపి నేతలు

తుపానుతో నష్టపోయిన ప్రాంతాలను, పంటలను రాజకీయనాయకులు, అధికారులు బుధవారం పరిశీలించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అనకాపల్లి : మిచౌంగ్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలకు నీట మునిగిన పంట పొలాలను టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యాన అనకాపల్లి మండలం మార్టూరు గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న బాధలు అడిగి తెలుసుకొని వరి పొలాలను పరిశీలించారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు తెలియజేస్తామని తెలిపారు. టిడిపి నాయకులు కోడి నాగేశ్వరరావు, కర్ణం దుర్గాప్రసాద్, కోట్ని రామకృష్ణ, బోడి వెంకట్రావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్చార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యాన అచ్యుతాపురం, రాంబిల్లి, మునగపాక మండలాల్లో బుధవారం మోకాలు లోతు నీటిలో దిగి వరి పంటను పరిశీలించారు. మునిగిన వరి పంట ఎందుకు పనికిరాదని ఆయన చెప్పారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

సముద్ర తీర ప్రాంతమైన పూడిమడక మత్స్యకారులను, తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రగడ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన మత్స్యకారులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు జనపరెడ్డి నరసింహారావు, కూనిశెట్టి సత్తిబాబు, కాండ్రేగుల సూర్యనారాయణ, డ్రీమ్స్ నాయుడు, మెరుగు బాపు నాయుడు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని గండికాలనీ దగ్గర, సింహాద్రిపురం రోడ్లో ఉన్న పంట పొలాలను, రేవళ్ల గ్రామంలోనూ మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గూనూరు వెంకట సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యక్రమంలో టిడిపి మండల ఇన్చార్జి జనపరెడ్డి నర్సింగరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, టిడిపి మత్స్యకార నాయకుడు మెరుగు బాపు నాయుడు తదితరులు తదితరులు గ్రామంలో పర్యటించారు ఈ పర్యటనలో ఎర్రి తాత శ్రీరామ్ బంగారయ్య సమ్మింగి లక్షణ ధనరాజు కొండయ్య పుక్కల బుజ్జి చిన్న దేవుడు చిన్న వీర్రాజు దుర్గారావు ధనరాజు ధోని నూకరాజు అప్పలరాజు తాతాజీ ధోని బీడు బాబు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన నేతల సందర్శన

బుచ్చయ్యపేట/ వడ్డాది : నష్టపోయిన వరి రైతులకు ఎకరాకు 30 వేలు పరిహారం ఇవ్వాలని చోడవరం నియోజకవర్గం టిడిపి, జనసేన పార్టీల ఇన్‌ఛార్జులు బత్తుల తాతయ్య బాబు, పివిఎస్ఎన్ రాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బంగారమెట్ట ఎల్బిపురం, వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాల్లో నీట మునిగిపోయిన వరి పొలాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు సాయం శేషు, డిఎస్ నాయుడు, గునూరు మూల నాయుడు, కర్రి రమేష్, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, దిందా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జెడ్‌పిటిసి సందర్శన

బుచ్చయ్యపేట : మండలంలోని చిన్నప్పన్నపాలెం, ఐతంపూడి తదితర గ్రామాల్లో తుఫాన్ నష్టపోయిన వరి పంటలను జడ్పిటిసి దొండ రాంబాబు బుధవారం పరిశీలించారు. రైతులను ఆడుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీనివాసరావు, కోవెల ఈశ్వరరావు, పెద్దడ నాయుడుబాబు పాల్గొన్నారు.

సిపిఐ నేతల సందర్శన

కసింకోట : కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో సిపిఐ నాయకలు వర్షానికి మునిగిన పంటను పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, నారాలశెట్టి సత్యనారాయణ, అళ్ళ అప్పలనాయుడు, వియ్యాపు రాజు, బుద్ధ నాయుడు పాల్గొన్నారు.

పెందుర్తి : 95వ వార్డులో ముంపునకు గురైన గొల్లవిల్లివానిపాలెం, సాయిసౌదానగర్ ప్రాంతాలలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాలువల పనులకు అంచనా వేసి, త్వరగా ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. జెడ్‌సి ఎం.మల్లయ్యనాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం మండలంలో ముంపునకు గురైన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, భీమునిపట్నం వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్, ఆనందపురం మండల వ్యవసాయాధికారి సిహెచ్ సంధ్య రత్నప్రభ పరిశీలించారు. సుమారు 30 ఎకరాల్లో వరి పంట నీటి ముంపునకు, 70 ఎకరాల్లోని వరి పంట నేలవాలినట్లు గుర్తించారు. వర్షం తగ్గిన వెంటనే వరి పనల మీద 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాలలో కార్పొరేటర్ మొల్లిహేమలత, టిడిపి నాయకులు మొల్లి లక్ష్మణరావు పర్యటించారు. మారికవలస జంక్షన్ శారదనగర్‌లో ఇళ్ల కింద మట్టి కొట్టుకు పోవడంతో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న పల్లా గోపాలం, చిన్నమ్మలు, సాకేటి కృష్ణ పుష్ప నివాసగృహాలను పరిశీలించారు. ఈ విషయాన్ని జివిఎంసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పబ్లిక్ వర్క్స్ ఇఇ శాంతిరాజు, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పలరెడ్డి, విఆర్ఒ పూర్ణ, సచివాలయ సెక్రటరీలు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతామని తెలిపారు.

గాజువాక : జివిఎంసి 75వ వార్డు పరిధి పెంటమాంబ ఊటగెడ్డను, 76వ వార్డు పరిధిలోని ప్రధాన కాలువను, నడుపూరులో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలిసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి పరిశీలించారు. పెంటమాంబ ఊటగెడ్డ ఎత్తు పెంచాలని, 76వ వార్డులోని గంగవరం పోర్టు వద్ద ప్రధాన కాలువ రోడ్డు కంటే ఎత్తు తక్కువగా ఉన్నందున బాక్స్ టైపు కాలువ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గంగవరం ఫ్లైఓవర్ నడిపూరు గెడ్డను పరిశీలించారు. గాజువాక జోనల్ కమిషనర్ పి సింహాచలం, కార్య నిర్వహణ ఇంజినీర్ ప్రసాద్‌బాబు, గంగవరం పిఆర్ఒ వెంకట్, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం, కోరాడ, అనంతవరం, పొట్నూరు, బాందేవుపురం, మద్ది గ్రామాల్లో నీటి మునిగిన వరి పంటను, గాలి కుప్పలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ వేణుగోపాల్, ఎడిఎ విజయప్రసాద్, మండల వ్యవసాయశాఖాధికారి ఎంవి చలం, నీటిలో ఉన్న వరి పంటను. గాలి కుప్పలను పరిశీలించారు. పంట నష్టాలను అంచనా వేశారు.

తగరపువలస : తుపానుకు దెబ్బతిన్న వరి పంట పొలాలను భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వ్యవ సాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. భీమిలి మండలం తాటితూరు, సింగనబంద గ్రామాల్లో పర్యటించి నీట మునిగిన వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పుడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, నాయకులు సిరిగిడి ఈశ్వరరావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.విజయప్రసాద్, ఎఒ బి.శివకోమలి, ఆర్‌బికె వ్యవసాయ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం, పద్మనాభం మండలాల్లో కిసాన్ మోర్చ విశాఖ జిల్లా అధ్యక్షులు పివివి.ప్రసాదరావు పట్నాయక్ పర్యటించారు. నీట మునిగిన వరి, పంటను, నేల వారిన వరి, అరటి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మీసాల రామునాయుడు, సారిక ప్రకాష్, బండారు అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

చోడవరం : కుండపోత వర్షాలకు చోడవరం పట్టణంలో ద్వారక నగర్, బానే కోనేరు, కోర్టు సముదాల్లోనూ వర్షపు నీరు చేరింది. స్థానిక ఎంపీడీవో శ్యాంసుందర్, పంచాయతీ ఈవో నారాయణరావు ద్వారకా నగర్‌లో వర్షపు నీటిని తొలగించే పని చేపట్టారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం జంక్షన్ వద్ద వర్షపు నీటితో చెరువులా మారింది. మావిడివాక, రంగుబోలు, పంది గెడ్డలు పొంగి ప్రవహించాయి. లోతట్టి ప్రాంతాలు జలమయయ్యాయి. కన్నూరుపాలెం, తీడ, అచర్ల, జమ్మాదులపాలెం రోడ్లు గోతులమయమయ్యాయి.

దేవరాపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాలు చెరువులను తలపిస్తున్నాయి. పిహెచ్‌సి, పోలీసు స్టేషన్, వ్యవసాయశాఖ కార్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం మోకాళ్ళ లోతులో నీరు చేరింది. దీంతో సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

పరవాడ : పరవాడ గ్రామదేవత పైడిమాంబ ఆలయం ఆనుకుని నిర్మించిన ప్రహరీ గోడ తుఫాన్ వలన బుదవారం నేలమట్టమైంది. ఈ ప్రాంతాన్ని బుధవారం మండల స్పెషల్ ఆఫీసర్ సందర్శించారు. పెద్ద చెరువును, ఊర చెరువును, వాటి అనుకోని ఉన్న పొలాలను పరిశీలించి పంట నష్టాన్ని, గ్రామంలో ఆస్తి నష్టాన్ని అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పైల శ్రీనివాసరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, తహసీల్దార్ కనకరావు, సిఐ ఈశ్వరరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలో బుధవారం ఉదయం నుండి భారీ వర్షాలు కురవడంతో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. ఆర్ భీమవరం వద్ద కొండ ప్రాంతం నుండి నీరు ఉధృతంగా గెడ్డ రావడంతో ఇద్దరు యువకుల కొట్టుకుపోతుండగా, వారిని స్థానికులు రక్షించారు. రాజాం వద్ద చెరువు నుండి నీరు గ్రామంలోకి ప్రవహించడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. అయితంపూడిలో గోవిందు అనే యువకునికి చెందిన ఇంటి ప్రహరీ కూలిపోవడంతో ప్రమాదం తప్పింది.

వడ్డాది : బుధవారం కూడా తెరిపివ్వకుండా కురిసిన వర్షంతో వడ్డాది పెద్దేరు వంతెన వద్ద వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది రిజర్వాయర్ గేట్లు ఎత్తివేయడంతో పడ్డాదిలో వంతెన పై నీరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో అధికారులు వంతెనపై వాహనాలు రాకపోకలు నిలిపివేశారు. పెద్దరు వంతెనను కొత్తకోట, చోడవరం సిఐలు సయ్యద్ ఇలియాస్ అహ్మద్ బి శ్రీనివాసరావులు, బుచ్చయ్యపేట ఎస్సై కే కుమార్ స్వామి సందర్శించారు. నర్సీపట్నం నుండి చోడవరం వైపు వెళ్లే వాహనాలు బంగారు మెట్ట నుండి వీరవిల్లి మీదగా చోడవరం నుంచి నర్సీపట్నం వెళ్లే వాహనాలను గౌరీపట్నం మీదుగా వెళ్లాలని ఎస్ఐ కుమార్ స్వామి ఆదేశించారు.

పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శన

యస్ రాయవరం : తుపాన్‌ప్రభావిత ముంపు గ్రామాల్లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గురువారం పర్యటించారు..బుధవారం ఉదయం కొరుప్రోలులోని పునరావాస కేంద్రాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శించారు. మండలంలోని చినగుమ్ములూరులో వరదనీరు పోయేందుకు చేపట్టిన సహాయకచర్యలలో పాల్గొన్నారు. అనంతరం ఉప్పరపల్లి వెంకటాపురం గ్రామాలను సందర్శించారు. ఎమ్మెల్యేతోపాటు పోలిశెట్టి పెదఈశ్వర్రావు, అద్దేపల్లి నూకునాయ్డు,స్థానిక నాయకులు శ్రీను, స్థానిక యస్ ఐ పి ప్రసాదరావు పాల్గొన్నారు.



ఎస్.రాయవరం ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే బాబూరావు

తూతూమంత్రపు పనుల వల్లే ముంపు



నీటి ముంపు ప్రాంతాలు పరిశీలిస్తున్న విజయ్

నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలో నర్సీపట్నం నుండి కృష్ణ దేవిపేట వెళ్లే మార్గంలో ఆర్అండ్‌బి అధికారులు తూతూమంత్రంగా చేసిన పనులు వల్లే పలురోడ్లు ముంపు బారిన పడ్డాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆరోపించారు. బుధవారం ముంపు బారిన పడ్డ రోడ్లను పరిశీలించారు.కల్వర్టు కూలిపోవడంతో మున్సిపల్, ఆర్అండ్‌బి అధికారులు అక్కడ పక్కా కల్వర్టు నిర్మించకుండా సిమెంట్ పైపులను అమర్చి చేతులు దులుపుకోవడంతో ఇప్పుడు రోడ్లు, పొలాలు, ఇల్లు, పక్కనే ఉన్న కాలేజీలు మొత్తం వర్షపు నీటితో మునిగిపోయాయన్నారు. హుటాహుటిన టిడిపి, కౌన్సిలర్లు, నాయకులతో అక్కడికి చేరుకున్న విజయ్, పరిస్థితిని సమీక్షించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కళ్ళు తెరిచి, తూరలు తీసివేసి పూర్తి స్థాయిలో కల్వర్టు నిర్మిచాలని విజయ్ డిమాండ్ చేశారు

గొలుగొండ : తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ డిమాండ్ చేశారు. బుధవారం గొలుగొండ మండలం జి.కొత్తూరు గ్రామంలో నీట మునిగిన పంటలను పరిశీలించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎకరానికి రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు..

సహాయక చర్యల్లో విఫలం : మాజీ ఎమ్మెల్యే అనిత



ముంపుబారిన పడిన నక్కపల్లి వీవర్స్ కాలనీలో అనిత సందర్శన

నక్కపల్లి :తుఫాన్ సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత మండిపడ్డారు. . ముంపునకు గురైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో బుధవారం పర్యటించారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికలను ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. దీంతో పలు కాలనీలు ముంపునకు గురయ్యాయని,ముఖ్యంగా నక్కపల్లి వీవర్స్ కాలనీ ముంపునకు గురి కావడంతో చేనేత కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజలను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలం ం దురదష్టకరమన్నారు .నష్టపోయిన చేనేత కార్మికులకు ప్రత్యేక ప్యాకేజీ చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు .

గొలుగొండ : తుపాన్ కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని మండల జనసేన నాయకులు గండెం దొరబాబు, రేగుబళ్ళ శివ డిమాండ్ చేశారు. మండలంలో వరి, అపరాలు, జనుము తదితర రైతులు నష్టపోయారన్నారు. తక్షణమే అధికారులు వెంటనే నష్టపరిహారం అంచనా వేసి ఎకరానికి 20వేలు అందించాలని డిమాండ్ చేశారు.

అంతా జలమయం!

మిచౌంగ్ తుపాన్ దెబ్బకు వరి పైర్లు గంగపాలు

ముంపుబారిన లోతట్టు ప్రాంతాలు :జనం అవస్థలు

తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

నక్కపల్లి : మిచౌంగ్ తీవ్ర తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అంతా జలమయమైంది. మండలంలో పలు కాలనీలు ముంపునకు గురికాగా, లోతట్టు ప్రాంతంలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. రాజీవ్ నగర్‌కాలనీలో చెరువుకు గండిపడడంతో నక్కపల్లి వీవర్స్ కాలనీ మంగళవారం అర్ధరాత్రి ముంపునకు గురైంది..చేనేత కార్మికుల మగ్గాలు ,చీరలు నేచేందుకు ముడి సరుకులు , నేచిన కొత్త చీరలు ,ఇంట్లో ఉన్న సామగ్రి తడిసి ముద్దయ్యాయి.చేనేత మగ్గాలు ,ముడి సరుకులు ,నేచిన చీరలు తడిసిపోవడంతో చేనేత కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముంపులో చిక్కుకున్న వద్దుడును స్థానిక యువత రక్షించి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఎమ్మెల్యే గొల్ల బాబురావు ముంపునకు గురైన కాలనీలో పర్యటించారు బాధితులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ,వైస్ ఎంపిపీ నానాజీ సహాయక చర్యలు చేపట్టారు

వీవర్స్ కాలనీలో కలెక్టర్ పర్యటన

ముంపునకు గురైన నక్కపల్లి వీవర్స్ కాలనీలో ం జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బుధవారం సాయంత్రం పర్యటించారు. ముంపునకారణాలు అడిగి తెలుసుకున్నారు.సహాయక చర్యలు, శానిటేషన్ వెంటనే చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు పరిహారం చెల్లిస్తామన్నారు .

ముంపుబారిన పలు కాలనీలు

ఉపమాక, నక్కపల్లి లో జగనన్న కాలనీ ముంపునకు గురైంది. సారిపల్లివాని పాలెంలో పూరింట్లోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ఇంట్లో చిక్కుకున్న వృద్ధురాలు కిల్లాడ మహాలక్ష్మిని ఎస్ఐ విభూషణరావుకాపాడారు. . ఉద్దండపురంలో బీసీ ఎస్సీ కాలనీలో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. బాధితులను ఎంపిటిసి బచ్చల రాజు పరామర్శించి, భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు . నక్కపల్లిలో రాజీవ్ నగర్ కాలనీ ,ముకుంద రాజుపేట లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది.రాజయ్య పేటలో పలు ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది .కాగిత ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేకపోవడంతో వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోయింది .దీంతో కాలనీ బస్సులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.పెదబోదుగల్లంలో బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం రోడ్డుపైకి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి .హై స్కూల్ స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి .స్కూల్ సెలవు కావడంతో విద్యార్థులు ఎవ్వరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు .

అన్నదాత విలవిల

నక్కపల్లి : చేతికందొచ్చిన వరి పంట కళ్ళ ఎదుటే వర్షార్పణం అవ్వడంతో అన్నదాత విలవిలలాడారు. .సుమారుగా 500 ఎకరాల్లో వరి నీటి మునిగింది.50 ఎకరాల వరకు కోసిన వరి పనలు నీటి మునిగాయి .వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్, సిబ్బంది బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు .

బాధితులను పలువురు పరామర్శ

నక్కపల్లి : తుపాన్ బాధితులను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివకుమారి,కొప్పిశెట్టి వెంకటేష్ కాలనీవాసులను పరామర్శించారు. కాంగ్రెస్‌నేత మేడిటి శంకర్ కాలనీలో సహాయక చర్యలు చేపటి, రొట్టెలను పంపిణీ చేశారు .ఆర్‌డిఒ జయరాం, మండల ప్రత్యేక అధికారి ప్రభాకరరావు ,తహశీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో శ్రీనివాసరావు ఇఐఆర్‌డి సత్యనారాయణ ,వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి , నక్కపల్లి పిఏసిఎస్ పర్సన్ ఇన్చార్జి ఎలమంచిలి తాతబాబు, శేషారత్నం ముంపునకు గురైన కాలనీని పరిశీలించారు.

చినదొడ్డిగల్లు హైవే జంక్షన్ జలమయం

నక్కపల్లి :మండలంలోని చినదొడ్డిగల్లు హైవే జంక్షన్ జలమయం కావడంతో.వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. సీఐ అప్పన్న, ఎస్ ఐ విభూషణరావు ఆధ్వర్యంలో జెసిబి సహాయంతో డివైడర్‌ను తవ్వించి వర్షపు నీరు బయటకు పోయే విధంగా చర్య చేపట్టారు. హెటిరో డ్రగ్స్ కంపెనీ జలమయం అయింది .హెటిరో రోడ్డు గుండా వర్షపు నీరు ప్రవహించడంతో ,వాహనాలు రాకపోకలకు ఆటంకం ఏర్పడడంతో,ఉపమాక మీదుగా కంపెనీ వాహనాలు రాకపోకలు సాగించాయి

రావికమతం :తుపాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరి పొలాలు, చెరువులను తలపిస్తున్నాయి. మండలంలో చినపాచిల , రావికముమ్, బుద్ధిబంధ,కొమిరా, గర్నికం, గుడ్డిప, తదితర గ్రామాలలో వరిపైర్లు నీటమునిగాయి. పంట చేతికొచ్చే దశల్లో వర్షాలుముంచెత్తడంతో తీవ్రనష్టం జరిగిందని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితరైతులు కోరుతున్నారు.

రావికమతం: తుఫానుకు పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని కొమిర సచివాలయ వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ దాసరి వరహాలు కోరారు. కొమిర సచివాలయం పరిధిలోని కేబీపీ అగ్రహారం, కవగుంట, కొమిర గ్రామపంచాయతీల్లో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని,వ్యవసాయ, రెవిన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన రైతాంగానికి ఇక్రాప్ ఆధారంగా పరిహారం చెల్లించాలని కోరారు.

చీడికాడ: తుఫాను ప్రభావంతో మండలంలోని పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు, రామచంద్రపాలెంలో గర్భిణి వ్రిటి నె వ్ప్ల తో బాధపడుతున్న గర్భిణిని హస్పిటల్‌కు తీసుకు వచ్చేందుకు రహదారి సక్రమంగా లేకపోవడంతో తాహశీల్దార్ జానకమ్మ, విఆర్‌ఒ అనూష చొరవ తీసుకొని వేరే మార్గంలో హస్పిటల్లో చేర్చారు, మంగళవారం రాత్రి నుండి విద్యుత్ సౌకర్యం లేక అవస్థలు పడ్డారు. ముంపు ప్రాంతాలను ఆర్‌డిఒ జయరాం, తాహసిల్దార్ జానకమ్మ, ఎస్సై నారాయణరావు, రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టారు.

గొలుగొండ: తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఏఎల్ పురం బిసి కాలనీ డ్రెయినేజీలు లేక వీధుల్లో వర్షం నీరు పారింది.లింగంపేట బొడ్డేరు గెడ్డ, చీడిగుమ్మల వరహానది, జోగంపేట వద్దన్న బోరింగ్ గెడ్డలు ఉధృతంగా ప్రవహించాయి. రోడ్డుపైకి నీరు రావడంతో జోగుంపేట నుంచి పాత మల్లంపేటకు వెళ్లే రహదారిలో కొంతసేపు రాకపోకలు నిలిచిపోయాయి.



నీటి ముంపులో నక్కపల్లి వీవర్స్ కాలనీ



ముంపునకు గురైన వీవర్స్ కాలనీని పరిశీలిస్తున్న కలెక్టర్



మాడుగులలో నీట మునిగిన పంటపొలాలు

గ్రామాల్లో వరి, ఇ తర పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది, కోసిన వరిచేను పనలు నీటిముంపునకు గురికాగా, కోతకు సిద్ధంగా ఉన్న వరిచేను ఈదురుగాలులు, వర్షానికి నేలకొరిగింది. శ్రమ, పెట్టుబడిపెట్టి, తీరా పంట చేతికొచ్చే స్థితిలో మిచౌంగ్ తమను ముంచేసిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని మొరపెట్టుకుంటున్నారు

కొత్తకోట :మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో రావికమతం మండలంలో కొత్తకోట, చీమలపాడు, దొండపూడి, గొంప, మట్ట వానిపాలెం, టి. అర్జాపురం, మేడి వాడ, రావికమతం తదితర గ్రామాలలో రెండు వేల ఎకరాలలో పంట ముంపు కు గురైనట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. చీమలపాడు శివారు కడగెడ్డ సమీపంలో గిరిజనులకు చెందిన వరి పంట నీట మునిగింది. కొత్తకోట గ్రామంలో వీరవెల్లి ఈశ్వరరావుకు చెందిన సుమారు రూ.80 వేల విలువైన పాడి గేది మృతి చెందింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీవర్షాలతో కల్యాణపులోవ రిజర్వాయర్‌కు పెద్దఎత్తున నీరు చేరడంతో గరిష్టనీటిమట్టం 460 అడుగులుకాగా, బుధవారం 445 అడుగుల నీటిమట్టం చేరిందని జలాశయం ఎఇ సత్యనారాయణ దొర తెలిపారు.

కోటవురట్ల: తుపాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులన్ని నదులను తలపించాయి, దాదాపుగా అన్ని గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగి కొట్టుకుపోయాయి. మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై నీరు ప్రవహించడంతో జనజీవనం అస్తవ్యస్తమయింది, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రహరీ నీటమునిగి పడిపోయింది, పందూరు,గొట్టువాడ, బికెపల్లి, వెంకటాపురం తంగేడు కొడవటిపూడి తదితర గ్రామాలలో రోడ్లపై నుంచి నీరు ప్రవహించడం తో ప్రయాణికులు వాహనదారులు

1841 ఎకరాల్లో వరి పంటకు నష్టం

మాడుగుల: మిచౌంగ్ ప్రభావంతో మండలంలో 1841 ఎకరాలలో వరి పంట నీట మునిగినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.వాసుదేవరావు తెలిపారు. బుధవారం పలు గ్రామాల్లో పర్యటించారు. తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయని, వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. రైతులు పొలాల్లోని నీటిని బయలకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు..

ఎస్.రాయవరం : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో వరదలలో చిక్కుకున్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం వరహానది ఉప్పొంగడంతో ధర్మవరం, వెంకటాపురం గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరి వరదలో చిక్కుకున్న ప్రజలను ఎస్ఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించారు. వరహానది పొంగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాలకు చేరుకోలేని ప్రజలకు మండల మండల కేంద్రంలో వసతి భోజన సదుపాయాలు కల్పించినట్టు తహశీల్దార్ విజయకుమార్ తెలిపారు.

సింహాచలం: సింహాచలం నుంచి విజనగిరిపాలెం వెళ్లే ప్రాంతంలో ఉన్న విద్యుత్ వైర్లు, భారీ వృక్షాలు నేలకొరిగాయి. దీంతో ఈ ప్రాంతంతో బుధవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. మరో రహదారిలో భారీ వృక్షాలు నేలకొరగడంతో వాహనదారుల, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

కూలిన రిటర్నింగ్ వాల్

ఆరిలోవ : మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరిలోవ కొండవాలు ప్రాంతం బిసి కాలనీలో మంగళవారం తెల్లవారుజామున రిటర్నింగ్ వాల్ ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో కింది వరుసలో ఉన్న మూడు ఇళ్లపై మట్టిపెళ్లలు పడ్డాయి. పెద్ద ఎత్తున మట్టి పెళ్లలు శ్లాబ్‌లపై పడిపోవడంతో అక్కడ ఉన్న వాటర్ ట్యాంకులు, ఇతర సామగ్రి ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఎవ్వరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదమూ జరగలేదు. ఈ విషయాన్ని చినగదిలి తహశీల్దార్ దృష్టికి స్థానిక టిడిపి వార్డు అధ్యక్షులు తీసుకెళ్లారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సందర్శించారు.

పెందుర్తి : మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో పెందుర్తి మండలంలో రోడ్లన్నీ అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లడంతో ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పలేదు. పొలాల్లో వరి దిబ్బలు పెట్టినప్పటికీ రైతులు భయాందోళన చెందుతున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారాలు స్తంభించాయి.

చిన్నగొర్రెగడ్డ గిరిజన గ్రామానికి నిలిచిన రాకపోకలు

మాడుగుల: మండలంలోని చిన్న గొర్రెగడ్డ గిరిజన గ్రామానికి ప్రధాన రహదారి వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలోని 100 కుటుంబాలు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు సత్వరమే స్పందించి తమ గ్రామానికి సహాయక చర్యలు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మల్లంపాలెం గ్రామానికి రాకపోకలు బంద్

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామ శివారు మల్లంపాలెం గ్రామానికి రాకపోకలు ఆగిపోయాయి. చౌడువాడ మల్లం పాలెం గ్రామాల మధ్య చిత్తగడ్డపై ఉన్న బ్రిడ్జి హుదూద్ తుఫాన్ సమయంలో కృంగిపోయింది. పాత బ్రిడ్జిని తొలగించి దాని కిందన రాకపోకలు జరగడానికి సిమెంట్ గొట్టాలు వేసి తాత్కాలికంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. భారీ వర్షాలకు చిత్తగెడ్డ ప్రవాహానికి తాత్కాలిక మార్గం మంగళవారం రాత్రి కొట్టుకుపోయింది. దీంతో చౌడువాడ- మల్లంపాలెం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయి. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విరిగిన స్తంభాలు, విద్యుత్ అంతరాయం

తుఫాన్ వలన వీచిన ఈదురు గాలులతో మండలంలోని పలు గ్రామాలలో 10 విద్యుత్ స్తంభాలు, 6 ఫార్మర్లు నేలకొరిగినట్లు మండల విద్యుత్ శాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. దీంతో కొన్ని గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడిందని, వెంటనే తమ సిబ్బందితో అవకాశం ఉన్న గ్రామాలకు రాత్రికి రాత్రే విద్యుత్తు పునరుద్ధరించినట్టు చెప్పారు. గుల్లేపల్లి, చౌడువాడ గ్రామాలకు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ అంతరాయము ఏర్పడింది.



కోటవురట్లలో ముంపు నీటి మళ్లింపు చర్యలు



ఎస్.రాయవరంలో పునరావాసానికి తరలివెళ్తున్న బాధితులు